# కేసీఆర్‌పై డీజీపీకి కాంగ్రెస్ ఫిర్యాదు

**ఫోన్ ట్యాపింగ్‌పై విచారణకు వినతి**

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ): తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుపై కాంగ్రెస్ నేతలు గురువారం డీజీపీ రవిగుప్తాకు ఫిర్యాదు చేశారు. పార్టీ సీనియర్ నాయకుడు తుమ్మేటి సమ్మిరెడ్డితో కలిసి టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్‌గౌడ్ డీజీపీకి వినతిపత్రం అందించారు. గత ప్రభుత్వ హయాంలో ఒకే సామాజికవర్గానికి చెందిన పోలీసు అధికారులు ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డారని పేర్కొన్నారు. వారంతా ఒకే జిల్లాకు చెందినవారని తెలిపారు. ఈ కేసులో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు కూడా ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. అవసరమైతే కేసును సీబీఐ, ఈడీ వంటి సంస్థలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. కొందరు ఇంటెలిజెన్స్ పోలీసులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ కోట్లాది రూపాయలు దోచుకున్నారని పేర్కొన్నారు. కేసీఆర్ ఫాంహౌస్‌లో జరిగిన అన్ని విషయాలను వెలికితీయాలని, చట్టవిరుద్ధంగా ట్యాపింగ్‌కు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయాలని కోరారు. ఎమ్మెల్యేల కొనుగోళ్ల కేసులో ప్రధాన నిందితుల్లో ఒకరైన నందకుమార్ సైతం గురువారం డీజీపీ రవిగుప్తాకు ఫిర్యాదు చేశారు. తన ఫోన్ కూడా ట్యాపింగ్ చేశారని వినతిపత్రం ఇచ్చారు. ఎమ్మెల్యేల కొనుగోళ్లతో తనకు సంబంధం లేదని ఇన్నాళ్లూ చెప్పిన నందకుమార్ ఇప్పుడు ఎమ్మెల్యేలతో మాట్లాడిన మాటలు ట్యాపింగ్ చేసి విన్నారని చెప్పడం గమనార్హం.

## కేటీఆర్‌పై ఫిర్యాదు

హనుమకొండలో జీరో ఎఫ్ఐఆర్

బంజారాహిల్స్ పీఎస్‌కు బదిలీ

సుబేదారి మార్చి 28: సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ నాయకులు గురువారం హనుమకొండ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పీసీసీ నాయకుడు బత్తి నిశ్రీనివాస్ ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ నాయకులు హనుమకొండ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి 2,500 కోట్లు కాంట్రాక్టర్లు, బిల్డర్ల వద్ద వసూలు చేసి ఢిల్లీకి పంపించారని కేటీఆర్ తప్పుడు ఆరోపణలు చేశారని, లోక్‌సభ ఎన్నికల తర్వాత బీజేపీలోకి వెళ్తాడని అబద్ధాలు చెప్పి సీఎం స్థాయిని తగ్గించేలా మాట్లాడారని, తద్వారా ప్రజలకు తప్పుడు సంకేతాలు వెళ్తున్నాయని పేర్కొన్నారు. కేటీఆర్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. హనుమకొండ పోలీసులు కేటీఆర్‌పై జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి హైదరాబాద్ బంజారాహిల్స్‌కు కేసు బదిలీ చేశారు.

# ఇందిరమ్మ ఇండ్లు.. గ్రామాలకే పరిమితం

- **తొలిదశలో గ్రామాలకే ప్రాధాన్యం**
- **జాగ ఉన్నా పట్టణ ప్రాంతాలకు నో**
- **ఎన్నికల తర్వాత మార్గదర్శకాలు**
- **పేదలైనా తెల్లకార్డు లేకుంటే అంతే**
- **పట్టణ ప్రాంతాల్లో 'ఇన్‌సిటు' పద్ధతి**

హైదరాబాద్, మార్చి 28(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం మొదటి విడత గ్రామీణ ప్రాంతాలకే పరిమితం కాబోతున్నది. గ్రామాల్లో సొంత జాగ ఉన్నవారికి తొలుత దీనిని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించుకున్నది. గ్రేటర్ హైదరాబాద్ సహా పట్టణ ప్రాంతాల్లో జాగలు ఉన్నా మొదటి దశలో అవకాశం లేదని అధికారులు చెప్తున్నారు. పార్లమెంటు ఎన్నికల తర్వాత మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసే అవకాశం ఉందని సమాచారం. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా ప్రతి నియోజకవర్గంలో 3,500 చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 4,50,000 ఇండ్లు నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. సొంతజాగ ఉన్న వారికి ఇల్లు కట్టుకునేందుకు రూ. 5 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తారు. దారిద్ర్యరేఖ (బీపీఎల్)కు దిగువనున్న ఉన్న కుటుంబాలకు ఇది వర్తిస్తుంది. తెల్లరేషన్‌కార్డు తప్పనిసరి. సొంత జాగ ఉండి కిరాయి ఇండ్లలో కానీ, కచ్చా ఇండ్లలో కానీ నివసిస్తున్నవారు ఈ పథకానికి అర్హులు. గ్రామసభల్లో లబ్ధిదారులను గుర్తించిన తరువాత జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆమోదంతో కలెక్టర్ ఇండ్లను మంజూరు చేస్తారు. కనీసం 400 చదరపు అడుగుల వైశాల్యంలో స్లాబు నిర్మాణం, అందులో వంటగది, మరుగుదొడ్డి తప్పనిసరిగా నిర్మించుకోవాలి. మహిళ పేర ఇల్లు మంజూరవుతుంది. పునాదులు పూర్తయ్యాక లక్ష, రూఫ్ లెవల్ వచ్చాక మరో లక్ష, స్లాబ్ వేశాక రూ. 2 లక్షలు, మొత్తం పూర్తయ్యాక మిగిలిన లక్ష చొప్పున లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది. జిల్లాల్లో కలెక్టర్లు, జీహెచ్‌ఎంసీ పరిధిలో కమిషనర్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ(టీఎస్‌హెచ్‌సీఎల్) పర్యవేక్షణలో గృహ నిర్మాణం సాగుతుందని ప్రభుత్వ ఉత్తర్వుల్లో స్పష్టంచేసింది.



### లోపభూయిష్టంగా మార్గదర్శకాలు

జీహెచ్‌ఎంసీ సహా పట్టణ ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో పేదలు బస్తీల్లో నివసిస్తున్నారు. చాలా మంది పేదలు పట్టణ శివారు ప్రాంతాల లేఔట్లలో ప్లాట్లు కొనుగోలు చేసి ఇల్లు నిర్మించుకునే స్థోమత లేక కిరాయి ఇండ్లలో ఉంటున్నారు. గ్రేటర్‌తోపాటు పట్టణ ప్రాంతాల్లో ఎక్కువశాతం గ్రామ పంచాయతీ లేఔట్లే ఉన్నాయి. వీటికి రిజిస్ట్రేషన్ పత్రాలు ఉంటాయి తప్ప ఎటువంటి అధికారిక అనుమతులు ఉండవు. కొందరు గ్రామకంఠం, సీలింగ్ ల్యాండ్‌లో నోటరీ పత్రాలపై కొనుగోలు చేసి కచ్చా ఇండ్లు ఏర్పాటు చేసుకున్నారు. చాలామందికి తెల్లరేషన్ కార్డులు లేవు. పట్టణ ప్రాంతాల్లోని వివిధ బస్తీలు, కాలనీలు, లేఔట్లకు సంబంధించిన సమస్యలపై మార్గదర్శకాల్లో స్పష్టత ఇవ్వలేదు. తెలుపురంగు కార్డు ఉన్నప్పటికీ మహిళలు లేకుంటే ఇల్లు మంజూరయ్యే అవకాశం లేదు. ప్రభుత్వమార్గదర్శకాల్లో ఇటువంటి పేదలకు సంబంధించి ఎటువంటి స్పష్టత ఇవ్వలేదు. కేవలం గ్రామీణ ప్రాంతాల్లో సొంత జాగల్లో గుడిసెలు, తాత్కాలిక ఇండ్లలో నివసిస్తూ, తెల్లరేషన్‌కార్డు ఉన్నవారు మాత్రమే అర్హులని అధికారులు స్పష్టం చేస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్నవారి కోసం ఇన్‌సిటూ(వారు ఉంటున్నచోటే సామూహికంగా అపార్ట్‌మెంట్లు) పద్ధతిలో ఇండ్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం యోచిస్తున్నది. వారు ఉంటున్న బస్తీలను ఖాళీ చేయించి, అక్కడే మూడు, నాలుగు అంతస్తుల్లో చిన్నచిన్న ఫ్లాట్లను నిర్మించే యోచన ఉన్నట్లు అధికారులు తెలిపారు.

### రూ.5000 కోట్ల లోటు పూడ్చడం ఎలా?

ప్రజాపాలన సందర్భంగా ఇంటి నిర్మాణం కోసం 82,82,332 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం మాత్రం 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఒక్కో నియోజకవర్గానికి 3,500 చొప్పున 119 నియోజకవర్గాల్లో 4,50,000 ఇండ్లు నిర్మించనున్నట్టు ప్రకటించి, ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో గృహనిర్మాణం కోసం 7,740 కోట్లు కేటాయించింది. ఆ ఇండ్లకు 22,500 కోట్లు ఖర్చవుతుంది. హడ్కో నుంచి 3,000 కోట్లు రుణంగా సేకరిస్తుండగా, ఒక్కో ఇంటికి 1.5లక్షల చొప్పున కేంద్రం నుంచి 6,750 కోట్ల వరకూ నిధులు వచ్చే అవకాశం ఉంది. అన్నీ కలుపుకొంటే 17,490 కోట్లు అవుతుంది. ఇండ్లకు రూ.ఐదు లక్షల చొప్పున ఇవ్వాలంటే రూ.5000 కోట్లకుపైగా లోటు కనిపిస్తున్నది. ప్రభుత్వం ప్రకటించిన విధంగా నాలుగున్నర లక్షల మందికి ఇండ్లు మంజూరు చేస్తే ఈ లోటు ఎలా పూడ్చుతారన్నది అంతుబట్టడంలేదు.

## లోకం పోకడ




ఎన్నికల్లో గెలుపు కోసం మీటింగ్ అంటే పార్టీ నేతలతో అనుకున్నా!

## ఎండా కాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 41.6°c | 22.8°c |
| రంగారెడ్డి | 41.6°c | 17.9°c |
| మెదక్ | 41.3°c | 20.6°c |
| నిజామాబాద్ | 40.5°c | 25.0°c |
| ఖమ్మం | 40.0°c | 22.0°c |
| హైదరాబాద్ | 39.2°c | 24.6°c |
| మహబూబ్‌నగర్ | 38.2°c | 25.0°c |
| నల్లగొండ | 39.0°c | 24.0°c |
| వరంగల్ | 39.0°c | 26.0°c |
| కరీంనగర్ | 38.0°c | 27.0°c |

## పెరిగిన ఎండలు

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ): గురువారం నుంచి ఐదు రోజుల పాటు ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. రోజువారీ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 5 డిగ్రీల వరకు పెరిగాయని వాతావరణ శాఖ తెలిపింది. నిర్మల్ జిల్లా దస్తూరాబాద్‌లో గురువారం అత్యధికంగా 43.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్‌లో 42.9, కొమ్రంభీం జిల్లా ఆసిఫాబాద్‌లో 42.5, ఆదిలాబాద్ జిల్లా అర్లి(టీ)లో 42.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో రాష్ట్రంలోని ఏడు జిల్లాల్లో ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు.

# భవనాల్లోనూ వాటా కావాలి!

- **హౌసింగ్‌బోర్డు కమర్షియల్ కాంప్లెక్స్‌లలో వాటా కోరుతున్న ఏపీ**
- **ఢిల్లీ ఏపీభవన్ తరహాలో పంచాలని పేచీ**
- **ఆస్తుల విక్రయానికి సర్కారు యత్నాలు**
- **పంపకం పూర్తయ్యేవరకూ ఏమీ చేయలేమంటున్న అధికారులు**

హైదరాబాద్, మార్చి 28(నమస్తే తెలంగాణ): హౌసింగ్ బోర్డు ఆధీనంలోని విలువైన భూములు, షాపింగ్ కాంప్లెక్స్‌లలోనూ ఆంధ్రప్రదేశ్ సమాన వాటా కోరుతున్నది. ఢిల్లీలో ఏపీభవన్‌ను విభజించిన తరహాలోనే ఇక్కడి ఆస్తులను కూడా విభజించాలని పట్టుబడుతున్నది. హౌసింగ్‌బోర్డు ఆస్తులను విక్రయించాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తుండగా, అది కుదరదని.. కేంద్ర ప్రభుత్వం ఆస్తులను పంపిణీ చేసేవరకు ఏమీ చేయలేమని అధికారులు చెప్తున్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికలు పూర్తయ్యాక ఏపీలో ఏర్పడే కొత్త ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది. ఏపీ పునర్విభజన చట్టంలో హౌసింగ్‌బోర్డును తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చడంతో ఆస్తులు, అప్పులను రెండు రాష్ట్రాలు సమానంగా పంచుకోవాల్సి ఉంది. హౌసింగ్‌బోర్డుకు హైదరాబాద్‌తోపాటు దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో 4,609 ఎకరాలు ఉండగా, అందులో 3,820 ఎకరాల్లో ఇది వరకే కాలనీలు నిర్మించారు. మిగిలిన 789 ఎకరాల్లో దాదాపు 80 ఎకరాలపై కోర్టులో కేసులు ఉన్నాయి. 610 ఎకరాలు క్లియర్‌గా ఉన్నట్టు అధికారులు చెప్తున్నారు. ఇవికాకుండా జేఎన్‌టీయూకి లీజుకిచ్చిన 100 ఎకరాలు సహా మొత్తం 150ఎకరాల భూమి లీజులో ఉంది. కొన్ని భూములపై కోర్టులో వివాదాలు కొనసాగుతున్నాయి. హైదరాబాద్ ఎంజే రోడ్, మహబూబ్‌గంజ్, బషీర్‌పల్లి, విజ్ఞాన్‌పురి, వెంగళరావునగర్, బర్కత్‌పుర తదితర ప్రాంతాల్లో 300 వరకు దుకాణాలు ఉన్నాయి. ఇవి కాకుండా గృహకల్ప, గగన్‌విహార్, చంద్రవిహార్, ఇన్ఫర్మేషన్ కమిషనర్ ఆఫీసు, మనోరంజన్ కాంప్లెక్స్, తుల్జాగూడ కాంప్లెక్స్, ఎస్ఆర్‌నగర్ కాంప్లెక్స్ తదితర భారీషాపింగ్ కాంప్లెక్స్‌లు ఉన్నాయి. వీటిల్లో వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, దుకాణాలు కొనసాగుతుండగా, వీటిపై ప్రస్తుతం నెలకు రూ. మూడు కోట్ల వరకూ అద్దెలు వస్తున్నాయి. హౌసింగ్‌బోర్డు ఉద్యోగుల జీతభత్యాలు ఈ అద్దెల ద్వారానే సమకూరుతున్నాయి. ఏళ్లుగా హౌసింగ్‌బోర్డు భవనాలు, దుకాణాలు, షాపింగ్ కాంప్లెక్స్‌ల అద్దెలు పెంచక అద్దెలు నామమాత్రంగానే వస్తున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో 2005లో అప్పటి ప్రభుత్వం ఈ దుకాణాలను విక్రయించాలని నిర్ణయించి ఉత్తర్వులు కూడా జారీచేసింది. అప్పటి మార్కెట్ రేట్‌ప్రకారం 11 దుకాణాలను విక్రయించగా, వివిధ కారణాలతో మిగతావాటి విక్రయం నిలిచింది.



### ఇరుపక్షాల అంగీకారం ఉండాల్సిందే!

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు హౌసింగ్‌బోర్డు ఆస్తులను విక్రయించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఆస్తులకు సంబంధించిన వివరాలు ఇవ్వాలని అధికారులను కోరింది. భూముల ధరలు భారీగా పెరగడంతోపాటు గృహనిర్మాణ రంగంలోకి అనేక ప్రైవేటు కంపెనీలు అడుగుపెట్టిన నేపథ్యంలో హౌసింగ్‌బోర్డు ద్వారా ఇండ్లు నిర్మించి విక్రయించే కంటే ఉన్న భూములు, షాపింగ్ కాంప్లెక్స్‌లను విక్రయించడమే మేలని ప్రభుత్వం భావిస్తున్నది. రాష్ట్ర విభజన చట్టంలోని తొమ్మిదవ షెడ్యూల్‌లో హౌసింగ్‌బోర్డు ఉండడంతో ఏపీ, తెలంగాణ మధ్య ఆస్తులను పంపిణీ చేయాల్సి ఉందని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. చర్చించుకొని ఓ ఒప్పందానికి వస్తే ఆస్తుల పంపిణీకి కేంద్ర హోంశాఖ తగిన ఉత్తర్వులు జారీచేస్తుందని, ఆ తర్వాతే విక్రయం సాధ్యమవుతుందని స్పష్టంచేశారు. ఇటీవల ఢిల్లీలోని ఏపీభవన్ విభజన విషయంలో ఇరు రాష్ట్రాలు చర్చించుకొని అంగీకారానికి వచ్చిన తరువాత ఆ మేరకు కేంద్ర ప్రభుత్వం ఏపీభవన్ విభజన ప్రక్రియను పూర్తిచేసింది.

### ఆస్తుల పంపిణీపై సుప్రీంలో కేసు

రాష్ట్ర పునర్విభజన చట్టం తొమ్మిదో షెడ్యూల్ (ప్రభుత్వ కంపెనీలు, కార్పొరేషన్లు)తోపాటు పదో షెడ్యూల్(నిర్దిష్ట రాష్ట్ర సంస్థల్లో సౌకర్యాల కొనసాగింపు) ఆస్తులను సమాన నిష్పత్తిలో పంచాలని ఏపీ ఇదివరకే సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ రెండు షెడ్యూల్‌లలో 233 సంస్థలు సహా మరో 12 సంస్థలను పునర్విభజన చట్టంలో పేర్కొనలేదని కోర్టుకు తెలిపింది. 245 సంస్థల ఆస్తుల విలువ సుమారు 1,42,601 కోట్లుగా ఏపీ పేర్కొంటున్నది. ఇందులో ఎక్కువ ఆస్తులు హైదరాబాద్‌లోనే ఉన్నాయని, వీటిని ఉమ్మడి రాష్ట్రంలోనే అభివృద్ధి చేసినట్టు చెబుతున్నది. వీటిని సమాన నిష్పత్తిలో పంపిణీ చేయాలని ఏపీ కోరుతున్నది.

# ఎన్నికలు నిర్వహించేది ఈసీ కాదు ఈడీ!

## ప్రతిపక్ష నేతలకే వరుసగా ఈడీ నోటీసులు

**బీజేపీ, మోదీ పాలనపై చర్చ రాకూడదనే ఎత్తుగడ • బీజేపీకి లొంగితే కేసులు ఉండవు**

**ప్రజాస్వామ్యాన్ని ఈడీ ఆఫీసు ముందు పెట్టిన మోదీ • బీఆర్ఎస్ నేత క్రిశాంక్ విమర్శలు**



హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ): దేశంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహిస్తున్నది ఈసీ కాదు ఈడీ అని బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో గురువారం క్రిషాంక్ మీడియాతో మాట్లాడారు. గత కొద్దిరోజుల్లో అనేకమంది ప్రతిపక్ష నేతలకు ఈడీ నోటీసులు ఇచ్చి, అరెస్టులు చేసిందని చెప్పారు. బీజేపీ ప్రత్యర్థులు పోటీ చేయకుండా మొత్తం ఈడీ కేసుల మీదనే దృష్టి పెట్టే విధంగా నోటీసులు జారీ చేస్తునారని ఆరోపించారు. ఎన్నికల్లో మోదీ తరపున బౌలింగ్, బ్యాటింగ్ ఈడీదేనని వ్యాఖ్యానించారు. ఈడీ, ఐటీ, సీబీఐ మోదీ టీమ్‌లో ఆటగాళ్లు అని చెప్పారు. దేశంలో బీజేపీ తప్ప ఇతర రాజకీయ పార్టీలు ఉండకూడదన్నది ప్రధాని మోదీ కుట్ర అని ఆరోపించారు. మోదీ ప్రభుత్వం తెలంగాణకు ఏమీ చేయలేదు అన్న అంశం లోక్‌సభ ఎన్నికల ఎజెండాగా ఉండరాదన్నది బీజేపీ ఆలోచన అని చెప్పారు. అందుకే ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను అక్రమంగా అరెస్ట్ చేశారని ఆరోపించారు. బీజేపీకి 400 సీట్లు వచ్చే ధీమా ఉంటే ఈడీ దాడులు, నోటీసులు ఎందుకని ప్రశ్నించారు.

### ఎన్నికల్లో అడ్డుకుంటున్నారు

ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అరెస్టుతో ఆమ్ ఆద్మీపార్టీ ధర్నాలు చేస్తున్నదని, ఆ పార్టీ నేతలు ఎన్నికల్లో పని చేయకుండా నిలువరించడంలో బీజేపీ సఫలమైందని క్రిషాంక్ అన్నారు. ఈడీ నోటీసులు అందుకున్న వారిలో ప్రముఖ నేతలు ఉన్నారని చెప్పారు. కేరళ సీఎం విజయన్ కుమార్తె వీణ, ఆర్జేడీ నేత సుభాష్, టీఎంసీ నేత మహువా మొయిత్రా, కశ్మీర్‌లో ఫరూక్ అబ్దుల్లా వంటి ప్రముఖులకు ఈడీ నోటీసులు అందాయని చెప్పారు. శివసేన పార్టీ టికెట్ ఇచ్చిన అమోల్ కీర్తికర్‌కు కొన్ని గంటల్లోనే ఈడీ తాఖీదులు పంపిందని తెలిపారు. డీఎంకే ఎంపీ రాజాకు సీబీఐ నోటీసులిచ్చిందని, సమాజ్‌వాదీ ఎమ్మెల్యేకు చెందిన రూ.26 లక్షలు జప్తు చేసుకొని నోటీసులు ఇచ్చారని వివరించారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా ఈడీ విచారణలో పాల్గొనేలా నాయకులను ఎంగేజ్ చేస్తున్నారని విమర్శించారు. బీజేపీలో చేరి లొంగిపోయిన వారికి అరెస్టులు లేవని చెప్పారు. లొంగకుండా పోరాడుతున్న వారిపై వేధింపులు, దాడులు, కేసులు పెడుతున్నారని ఆరోపించారు.

### మోదీ వెబ్ సిరీస్!

**ప్రధాని** మోదీ ఈడీ ఆధ్వర్యంలో వెబ్ సీరిస్ నడుపుతున్నారని మన్నె క్రిషాంక్ ఎద్దేవా చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలకు అన్ని విషయాలు వివరిస్తామని చెప్పారు. బీఆర్ఎస్ లేదు అంటున్న కిషన్‌రెడ్డి, తమ పార్టీ నేతలను చేర్చుకొని ఎందుకు టికెట్లు ఇస్తున్నారని ప్రశ్నించారు. ఓటమి భయంతోనే మోదీ ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. మోదీ ప్రజాస్వామ్యాన్ని ఈడీ కార్యాలయం ముందు పెట్టారని వ్యాఖ్యానించారు. దేశంలో ఏ పార్టీ అధికారంలో ఉండాలనేది ఈడీ నిర్ణయిస్తున్నదని అభిప్రాయపడ్డారు. దీనిపై ప్రజలు తేల్చుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు.

# మేడిగడ్డ రిపేర్‌కు తీరికలేదా?



రాజన్న సిరిసిల్ల జిల్లా సారంపల్లిలో రైతు పరశురాములును ఓదారుస్తున్న కేటీఆర్

మొదటిపేజీ తరువాయి...

వద్ద కాఫర్ డ్యాం కట్టి, వృథాగా సముద్రంలోకి పోతున్న నీటిని పంపింగ్ చేసి ఉంటే ఈరోజు ఈ దుస్థితి వచ్చేది కాదని తెలిపారు. అందుకే ఇది కాలం తెచ్చిన కరువు కాదని, పక్కా కాంగ్రెస్ తెచ్చిన కరువేనని విమర్శించారు. పంటలు ఎండిపోయి రైతులు అరిగోస పడుతుంటే పరామర్శించే తీరికలేదు గానీ, గత 4 నెలలుగా 15 సార్లు విమానం ఎక్కే, విమానం దిగే అన్నట్టు ఢిల్లీకి జాతర పోవుడు, యాత్రలు చేసుడు తప్ప ఇంతవరకు సీఎంగానీ, మంత్రులుగానీ రైతుల పొలాల దిక్కుచూసిన పాపాన పోలేదని ధ్వజమెత్తారు. వేసిన పంటలు మేతకు తప్ప ఎందుకూ పనికిరాకుండా పోయాయని అన్నారు. రైతుల గోస చూస్తుంటే గుండె తరుక్కుపోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. యాసంగిలో రైతుబంధు కోసం పెట్టిన రూ.7 వేల కోట్లను రైతులకు ఇవ్వకుండా కాంట్రాక్టర్ల ఖజానాకు, వారి పేమెంట్లకు పెట్టిన చిల్లర ప్రభుత్వమని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీమేరకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని, ఎన్నికల కోడ్ అడ్డురాకుండా ఎన్నికల కమిషన్‌కు ప్రత్యేక లేఖ రాసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం సారంపల్లిలో కౌలు రైతు జింకా పరశరాములుకు చెందిన ఎండిన వరిపంటను కేటీఆర్ పరిశీలించారు. పెట్టుబడి పెట్టి తీవ్రంగా నష్టపోయానంటూ కంటతడిపెట్టిన రైతును ఓదార్చి, అధైర్యపడవద్దని, అండగా కేసీఆర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలందరం ఉన్నామని భరోసా ఇచ్చారు. అనంతరం సిరిసిల్ల, వేములవాడలో జరిగిన పలు శుభకార్యాలకు హాజరయ్యారు. చీర్లవంచలో 'నమస్తేతెలంగాణ' బ్యూరో ఇన్‌చార్జి కడపర్తి ప్రకాశ్‌రావు కుటుంబసభ్యులను పరామర్శించారు. బీవైనగర్‌లోని షాదీఖానాలో ఇఫ్తార్ విందుకు హాజరయ్యారు. సిరిసిల్లలోని 33వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ నేత మూడం సాయికుమార్‌ను పరామర్శించారు. ఇటీవల పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసనలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తుండగా ప్రమాదవశాత్తు నిప్పంటుకుని సాయికుమార్ గాయాలపాలయ్యారు. మెరుగైన వైద్యం అందిస్తామని ఆయనకు భరోసా ఇచ్చారు.

### అధైర్యపడొద్దు అండగా ఉంటాం

'రైతులు అధైర్యపడొద్దు. అండగా మేమున్నాం. దయచేసి చేతులు జోడించి మొక్కుతున్నా ఆత్మహత్యల్లాంటి తీవ్రమైన చర్యలకు పాల్పడి కుటుంబాలను ఇబ్బందులపాలు చేయొద్దు' అని రైతులకు కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. 'కొంత మోసపోయి కాంగ్రెస్‌కు ఓట్లేసి గెలిపించుకున్నారు. మిమ్మల్ని ప్రభుత్వం పట్టించుకోనప్పటికీ, మంత్రులు, సీఎంకు తీరిక లేకపోయినా? మీ తరపున మేముంటాం' అని తెలిపారు. ప్రతి గ్రామానికి వస్తామని, మీ కోసం కేసీఆర్ స్వయంగా వస్తున్నారని ధైర్యం చెప్పారు. ప్రభుత్వ మెడలు వంచైనాసరే నష్టపరిహారం సాధించుకుందామని, మేడిగడ్డ రిపేర్ చేయించి కాళేశ్వరం నీళ్లు తెచ్చుకుందామని, ధాన్యానికి బోనస్, రుణమాఫీ సాధించుకుందామని భరోసా ఇచ్చారు. బీఆర్ఎస్ పెట్టిన ఆరు డిమాండ్లను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రైతుల్లో భరోసా నింపేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలంతా రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు 200 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ వెంట నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిషత్తు మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, టీఎస్‌టీపీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, ఎంపీపీ పడిగెల మానస, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ పూసపల్లి సరస్వతి, బీఆర్ఎస్ నాయకులు గజభీంకార్ రాజన్న ఉన్నారు.

### ప్రభుత్వానికి 6 డిమాండ్లు

1. రాష్ట్ర వ్యాప్తంగా 200 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నందున ప్రభుత్వం వెంటనే స్పందించాలి.
2. కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం రైతుభరోసా రూ.15 వేలు ఇవ్వాలి.
3. కౌలురైతులకు, రైతుకూలీలకు ఇస్తానన్న పైసలు వెంటనే ఇవ్వాలి.
4. ప్రభుత్వ నిర్లక్ష్యం, చెరువులు నింపకపోవటం, నీళ్లు ఇవ్వనందుకే పంటలు ఎండిపోయి రైతులు నష్టపోయారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఎకరాకు రూ.10 వేలు ఇస్తూ ఆర్డర్ తెచ్చింది. రైతులపై చిత్తశుద్ధి, ప్రేమ ఉంటే రూ.25 వేలు పరిహారం ఇవ్వాలి.
5. కోతకు వచ్చిన పంటలను కొనుగోలు చేసేందుకు కేంద్రాలను ఏర్పాటు చేయాలి. క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వాలి.
6. రూ.2 లక్షల రుణమాఫీ వెంటనే అమలు చేయాలి. రైతుల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే ముందుకు రావాలి.

## అసైన్డ్ భూములకూ ప్రైవేటు ధర

అభివృద్ధి పనులకు భూములు ఇవ్వండి

కొడంగల్‌లో రైల్వేలైన్, సిమెంట్ ఫ్యాక్టరీ

6న 5 గ్యారెంటీలు ప్రకటిస్తాం: రేవంత్‌రెడ్డి

కొడంగల్, మార్చి 28: అభివృద్ధి పనులకు భూములు ఇచ్చేందుకు కొడంగల్ ప్రజలు ముందుకు రావాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. అసైన్డ్ భూములకు సైతం ప్రైవేటు భూముల ధరలే చెల్లిస్తామని, ఈ మేరకు అధికారులకు ఆదేశాలు జారీచేశామని తెలిపారు. భూమి అందుబాటులో ఉంటేనే అభివృద్ధి పనులు పూర్తవుతాయని, లేదంటే ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయే ప్రమాదం ఉన్నదని హెచ్చరించారు. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా గురువారం ఆయన వికారాబాద్ జిల్లా కొడంగల్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో ఓటుహక్కు వినియోగించుకున్నారు. అనంతరం పట్టణంలోని సీఎం నివాసంలో కాంగ్రెస్ ముఖ్యనేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏండ్ల తరబడి కొడంగల్ నియోజకవర్గానికి మంత్రి పదవి దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొడంగల్ ప్రజల ఆశీర్వాదంతోనే తనకు సీఎంగా అవకాశం వచ్చిందని, కొడంగల్‌కు ఇదో సువర్ణ అవకాశమని, పూర్తి న్యాయం చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

### ప్రజలే ముందుకొచ్చి భూములివ్వాలి

కొడంగల్‌కు ఇప్పటి వరకు మెడికల్, ఇంజినీరింగ్, డిగ్రీ, జూనియర్ కళాశాల, బీటీరోడ్లతోపాటు ఇంటిగ్రేటెడ్ హాస్టల్ తదితర అభివృద్ధి పనులు మంజూరయ్యాయని ముఖ్యమంత్రి తెలిపారు. నిర్మాణ పనులకు నిధులు కూడా అందించినట్టు పేర్కొన్నారు. వందల కోట్ల నిధులతో కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించినట్టు చెప్పారు. నియోజకవర్గ ప్రజలే ముందుకు వచ్చి అభివృద్ధి పనులకు సహకరించాలని కోరారు. ఫార్మా కంపెనీలు ఈ ప్రాంతానికి వస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. కొడంగల్‌కు నష్టం జరిగే ఏ పనినీ తలపెట్టనని హామీ ఇచ్చారు. ఢిల్లీకి రాజైనా తల్లికి కొడుకేనని, తాను సీఎం హోదాలో ఉన్నా కొడంగల్ బిడ్డగానే అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని తెలిపారు. త్వరలోనే కొడంగల్‌లో సిమెంటు ఫ్యాక్టరీ ఏర్పాటు కాబోతున్నదని, కొడంగల్ మీదుగా కృష్ణా రైల్వేలైన్ పూర్తిచేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గతంలో ఇక్కడి విద్యార్థులు కర్ణాటక వెళ్లి చదువుకునే వారని, ఇక్కడ మెడికల్ కళాశాల వంటివి పూర్తయితే కర్ణాటక ప్రజలు ఇక్కడికే వచ్చి చదువుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు.

### పార్లమెంటు ఎన్నికల్లోనూ కష్టపడండి

అసెంబ్లీ ఎన్నికల్లో కష్టపడి పనిచేసి భారీ మెజార్టీతో తనను గెలిపించినట్టుగానే పార్లమెంటు ఎన్నికల్లోనూ కష్టపడి పనిచేసి కాంగ్రెస్‌ను గెలిపించాలని రేవంత్‌రెడ్డి కోరారు. ఏప్రిల్ 6న హైదరాబాద్ తుక్కుగూడలో రాహుల్‌గాంధీతో భారీ బహిరంగసభ ఏర్పాటు చేసినట్టు రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆ సభలో రాహుల్‌గాంధీ 5 గ్యారెంటీలను ప్రకటిస్తారని పేర్కొన్నారు. సభకు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్‌రెడ్డి, మహబూబ్‌నగర్ పార్లమెంటు అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, తాండూర్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, పార్టీ నాయకులు యూసుఫ్, నందారం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# 'ఉపాధి' వేతనాల్లో అన్యాయం

మొదటిపేజీ తరువాయి...

చేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఇది రూ.272 గా ఉంది. దక్షిణాది రాష్ట్రాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోనే ఉపాధి హామీ కార్మికులకు తక్కువ వేతనం అందనుంది. కాగా, పెంచిన వేతనం ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తుంది.

### ఎందుకింత వ్యత్యాసం?

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రోజువారీ పనికి వెళ్లే ఏ కార్మికుడికైనా తక్కువలో తక్కువగా రూ.700కు పైగా లభిస్తున్నది. ఉపాధి హామీ కార్మికులకు రూ.300 మాత్రమే ఇస్తామని కేంద్రం చెబుతున్నది. రోజంతా పని చేసినా రూ.300 కూడా రాకపోవడంతో కూలీలు ఉపాధి హామీ పని చేసేందుకు ఆసక్తి చూపించడం లేదు. పైగా ఇచ్చే అరకొర వేతనం కూడా సమయానికి రావడం లేదు. మూడునాలుగు నెలలకు ఒకసారి వేతనాలు వస్తుండటంతో కార్మికులు ఉపాధి హామీ వైపు చూడడం మానేశారు. వేరే ఏ పనీ దొరక్కపోతేనే ఇటువైపు వస్తున్నారు. ఫలితంగా కూలీల సంఖ్యతో పాటు పని దినాలు కూడా తగ్గుతున్నాయి.

# జైలులో సౌకర్యాలు కల్పించడం లేదు

- **అధికారులు కోర్టు ఆదేశాలు పాటించట్లే**
- **కవిత తరపు న్యాయవాదుల ఫిర్యాదు**
- **సమాధానం ఇవ్వాలని కోర్టు ఆదేశం**

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ): జైలు అధికారులు తనకు వసతులు కల్పించడం లేదని ఎమ్మెల్సీ కవిత అవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు తీహార్ జైలు అధికారులపై కవిత తరపు న్యాయవాదులు గురువారం ఢిల్లీలోని రౌస్ ఎవెన్యూ సీబీఐ ప్రత్యేక న్యాయస్థానానికి ఫిర్యాదు చేశారు. దీనిపై న్యాయమూర్తి.. జైలు అధికారులకు నోటీసులు జారీ చేశారు. ఈ నెల 26న కోర్టు ఆమెకు జ్యుడీషియల్ కస్టడీ విధించగా.. జైలులో తనకు కొన్ని సౌకర్యాలు కల్పించాలని న్యాయస్థానానికి విజ్ఞప్తి చేసిన సంగతి తెలిసిందే. కవిత విజ్ఞప్తి మేరకు సొంతంగా భోజనం ఏర్పాటు చేసుకోవడం, రోజువారీ ఉపయోగించే దుస్తులు తీసుకోవడం, కొన్ని ఆభరణాలు ధరించడం, సొంతంగా పరుపులు ఏర్పాటు చేసుకోవడం, దుప్పట్లు తెచ్చుకోవడం, చెప్పులు ధరించడం వంటి వెసులుబాట్లను న్యాయస్థానం కల్పించింది. కవితను తీహార్ జైలుకు తరలించే ముందే ఈ మేరకు ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఉత్తర్వులను తీహార్ జైలు అధికారులకు అందించామని, అయినా కవితకు జైలులో ఎలాంటి వసతులు కల్పించడం లేదని ఆమె తరపు న్యాయవాది మోహిత్‌రావు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. కనీసం రోజువారీ ఉపయోగించే దుస్తులకు కూడా అనుమతి ఇవ్వలేదని పేర్కొన్నారు. ఈ ఫిర్యాదును రౌస్ ఎవెన్యూ సీబీఐ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కావేరి భవేజా పరిశీలించారు. కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ఎందుకు అమలు చేయడంలేదో శుక్రవారం సమాధానం చెప్పాలని జైలు అధికారులను ఆదేశించారు.